కుట్టు.. 'ఉపాధి'కి మెట్టు

- మూడు నెలల శిక్షణతో పక్కా ఉపాధి
- టీడీఎఫ్, సమర్థ ఆధ్వర్యంలో ట్రెయినింగ్
- బీడీలు, కూలీ పనులకు ఫుల్‌స్టాప్



మిషన్లపై శిక్షణ పొందుతున్న మహిళలు



డ్రెస్ కట్టింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

ముస్తాబాద్: అతివలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కుట్టు శిక్షణ తోడుగా నిలుస్తోంది. ఇన్నాళ్లు బీడీలు చేస్తూ.. ఉపాధిహామీ కూలీ పనులు చేస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడ్డ మహిళలకు టైలరింగ్ శిక్షణ వరంగా మారింది. మెట్టప్రాంతం ముస్తాబాద్ మండలంలోని మహిళలు ఈ శిక్షణతో స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటున్నారు. మండల కేంద్రంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, సమర్థ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రం మహిళల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తుంది. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు తమ స్వగ్రామాల్లో డ్రెస్సులు, బ్లౌజ్‌లు కుడుతూ స్వయం ఉపాధి పొందుతున్నారు. వీరిపై సాక్షి స్పెషల్ స్టోరీ.

స్వయం ఉపాధికి బాటలు

ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుంచి శిక్షణ కేంద్రానికి 30 మంది మహిళలు వస్తున్నారు. వీరికి మూడు నెలలపాటు కుట్టులో శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల ఒక బ్యాచ్‌కు శిక్షణ పూర్తయింది. వారంతా కుట్టుతోపాటు డ్రెస్, బ్లౌజ్, గౌన్లకు అవసరమయ్యే కటింగ్ నేర్చుకున్నారు. నిత్యం ఆరు గంటలపాటు శిక్షణ పొందారు. వీరికి ఇన్‌స్ట్రక్టర్ బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్ తీసుకుని 80 రోజులకు తగ్గకుండా శిక్షణ ఇచ్చారు. సొంతంగా టైలర్ పెట్టుకుంటున్నారు. మరికొందరు ప్రభుత్వం ద్వారా స్కూల్ విద్యార్థుల యూనిఫామ్స్ ఆర్డర్లను అందుకుంటున్నారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు టీడీఎఫ్ ద్వారా కుట్టుమిషన్లను అందించడంతోపాటు రెండో బ్యాచ్ శిక్షణను ఈనెల15న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాజ పోకడలపై అవగాహన

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా శిక్షణ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలను ఎలా పెంచాలి, వారి చదువు, కెరీర్, సమాజంలో మహిళలకు ఎదురయ్యే లింగ వివక్షపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతను వివరిస్తున్నారు. చెట్ల ప్రాధాన్యత, పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది



టీడీఎఫ్, సమర్థ ఏర్పాటు చేసిన కేంద్రంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నాం. శిక్షణ పొందిన మహిళల్లో సొంతంగా పనిచేసుకోగలమనే ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. అందరం బ్లౌజ్‌లు, గౌన్లు, డ్రెస్‌లు కుడుతున్నాం. టీడీఎఫ్‌కు కృతజ్ఞతలు. – లావణ్య, ముస్తాబాద్

90 రోజులు శిక్షణ ఇచ్చాం



ముస్తాబాద్‌లో మొదటి బ్యాచ్‌కు 90 రోజుల శిక్షణ ఇచ్చాం. వారంతా గతంలో బీడీలు చేయడం, కూలీ పనులకు వెళ్లేవారు. ఇప్పుడు టైలరింగ్ సొంతంగా పెట్టుకోగలరు. ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే సర్టిఫికేట్లు అందజేస్తాం. – సునీత, ఇన్‌స్ట్రక్టర్

అపెరల్‌పార్క్‌లో ఉపాధి



ముస్తాబాద్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం విజయవంతమైంది. త్వరలో రెండో బ్యాచ్‌ను ప్రారంభిస్తాం. వీరందరికీ సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి పొందేలా టీడీఎఫ్ కృషి చేస్తుంది. జీవితంలో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తున్నారు. – మట్ట రాజేశ్వర్‌రెడ్డి, టీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు రండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని ఎదురుగట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12న జరగనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను విప్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సంపెట గంగరాజు, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, పొన్నం బాలయ్య, నరెడ్ల రాఘవరెడ్డి, కమిటీ సభ్యులు కోడం గంగాధర్, పొన్నం మల్లేశం, సోయినేని రాజు, ఎగుర్ల పర్శయ్య, నాగేందర్, అర్చకులు కార్తీక్, నాయకులు వకుళాభరణం శ్రీనివాస్, వంగపల్లి మల్లేశం, బండ శ్రీనివాస్‌లు ఉన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకుడు నారాయణ

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు ఎంద్ర నారాయణ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. గాలిపల్లి గ్రామ పెద్దమ్మ దేవాలయం కాంపౌండ్ వాల్ నిర్మాణం కోసం, గ్రామ మహిళా మత్స్య కార్మిక సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు నారాయణ తెలిపారు. సంఘం సభ్యుడు కుంభం చంద్రశేఖర్ ఉన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు అందాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జయంత్‌కుమార్

తంగళ్లపల్లి: రేషన్‌కార్డులు అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి అందేలా అధికారులు సర్వే నిర్వహించాలని తహసీల్దార్ జయంత్ కుమార్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో రేషన్‌కార్డు దరఖాస్తుదారుల ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాలన్నారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం ఏఎంసీ డైరెక్టర్ గుల్లపల్లి లక్ష్మారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గట్టు భారతమ్మకు రూ.60వేలు, గుల్లపల్లి రేవతికి రూ.20వేల చెక్కులను వారి ఇంటికి వెళ్లి అందజేశారు. నాయకులు నారాయణరెడ్డి, గుల్లపల్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతుగా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డికి అవార్డు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన గుడి శ్రీనివాసరెడ్డి ఉత్తమ రైతుగా ఎంపికయ్యారు. జగిత్యాలలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరెడ్డికి అవార్డు అందజేశారు.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు సోమవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొలనూర్‌లో ఏర్పాటు చేసిన వెంచర్ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలోనూ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వీరవేణి తిరుపతియాదవ్, శేఖర్‌గౌడ్, వి.తిరుపతి, నూగూరి గణేశ్, చందు ఉన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు చేయించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



కంటి పరీక్షలు ప్రారంభిస్తున్న కలెక్టర్

తంగళ్లపల్లి: అంగన్‌వాడీల్లో చదువుతున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బ్లైండ్‌నెస్ ప్రివెన్షన్ వీక్(అంధత్వ నివారణ వారోత్సవాలు)లో భాగంగా తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లోని అంగన్‌వాడీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు కంటి పరీక్షల శిబిరం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో 6 నెలల నుంచి 7ఏళ్లలోపు పిల్లలందరికీ కంటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పిల్లల్లో ఏవైనా కంటి సమస్యలు గుర్తిస్తే మందులు అందజేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరుశాతం, పాఠాలు బోధిస్తున్న తీరు పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి డా.రజిత, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, వైద్యులు నయీమా జహా, సంపత్ ఉన్నారు.

36వేల మంది పిల్లలకు వైద్యపరీక్షలు

అంగన్వాడీ పిల్లల ఆరోగ్యంపై స్మార్ట్ చెక్‌లో భాగంగా జిల్లాలోని 587 అంగన్వాడీ కేంద్రాల్లో 36వేల మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య ఆధ్వర్యంలో భౌతిక అభివృద్ధి, మానసిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, ఉద్వేగ అభివృద్ధి, సునిశిత చాలక నైపుణ్యాలు, కండర సమన్వయ నైపుణ్యం, భాష మాట్లాడే నైపుణ్యాలు వంటి 9రకాల అంశాలను వైద్యులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి తమ పిల్లలకు అంగన్వాడీల్లో తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

చిన్నారులకు కంటి పరీక్షలు

కోనరావుపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, అంధత్వ నివారణ వారోత్సవాలు పురస్కరించుకొని ధర్మారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సౌందరయ్య, సూపర్‌వైజర్ కనకమ్మ, అంగన్వాడీ టీచర్లు జొన్నల అరుణ, వెలిశాల రమాదేవి, నేరెళ్ల చంద్రకళ, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



తంగళ్లపల్లి: వేణుగోపాల్‌పూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు



ముస్తాబాద్: కొండాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాణి

ముస్తాబాద్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం, కొండాపూర్, మొర్రాయిపల్లి, గన్నెవారిపల్లి గ్రామాల్లో సోమవారం ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ సురేశ్, ఏపీవో బీరయ్య, ఏపీఎం దేవరాజు, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండంలోని రామన్నపల్లి, బస్వాపూర్, ఓబులాపూర్, అంకిరెడ్డిపల్లి, వేణుగోపాలపూర్, రాళ్లపేట గ్రామాల్లో ఐకేపీ మెప్మా మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూపరెడ్డి, వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని తహసీల్దార్ సుజాత కోరారు. మండలంలోని వెంకటాపూర్, హరిదాస్‌నగర్, అగ్రహారం, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సోమవారం తహసీల్దార్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ నిర్వాహకులు రైతులకు ఇబ్బంది కలిగించకుండా ధాన్యం తూకం వేయాలన్నారు. ఏపీఎం మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, సీసీ పద్మ, వీవోఏలు రేఖ, రాజ్యలక్ష్మి, రేణుక, అక్షిత పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంతోపాటు మండలంలోని బావుసింగ్‌నాయక్‌తండా, భూక్యతండా, రంగంపేట, వన్‌పల్లి గ్రామాల్లో తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఏఎంసీ చైర్మన్ రాములు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. వైస్‌చైర్మన్ లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం నర్సయ్య, డైరెక్టర్ చంద్రమౌళి, మదన్‌లాల్, మాజీ ఎంపీటీసీ అరుణ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సంతోష, సీఏలు రాధ, పద్మ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి పెద్దపీట



నియామకపత్రాలు అందిస్తున్న కాముని వనిత

సిరిసిల్లటౌన్: మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పేర్కొన్నారు. సిరిసిల్లలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మహిళా సాధికారత కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే క్రమంలో మహిళలకు అందరికీ సమాఖ్య సంఘాల నుంచి బస్సులు కొనుగోలు చేసి ఇస్తుందన్నారు. ఇల్లంతకుంట మండల అధ్యక్షురాలిగా జ్యోతి, బోయినపల్లి మండల అధ్యక్షురాలిగా రాజలక్ష్మి, తంగళ్లపల్లి మండల అధ్యక్షురాలిగా హారికరెడ్డి, ముస్తాబాద్ మండల అధ్యక్షురాలిగా వనిత, బ్లాక్ కాంగ్రెస్ మహిళా ప్రెసిడెంట్‌గా రమాదేవి, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సామల రోజా, జిల్లా సెక్రెటరీగా సరితరెడ్డిలకు నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలుముల స్వరూప, మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మడుపు శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాల్లో విద్యార్థుల సత్తా



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముస్తాబాద్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షల్లో ముస్తాబాద్ మండలం మోహినికుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఏకంగా 21 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇటీవల వెలువడిన గురుకుల ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 21మంది విద్యార్థులు గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. నాయకులు గోపాల్‌రావు, సతీశ్‌గౌడ్, స్వామి ఉన్నారు.

వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు..

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి లేతమామిండ్లవాగుపై వంతెనతో పాటు మరో మూడు లోలెవల్ వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి సూదర్శన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన 'వంతెనలు నిర్మించరు.. కష్టాలు తీరవు' అనే కథనానికి అధికారులు స్పందించారు. లోలెవల్ కల్వర్టులను శాశ్వత వంతెనలుగా నిర్మించడానికి నిధుల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.

కాంగ్రెస్ పాదయాత్ర



పాదయాత్రలో కేకే.మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో కాంగ్రెస్ నిర్వహిస్తున్న రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర సోమవారం సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రాళ్లపేట, రామచంద్రాపూర్ గ్రామాల్లో సాగింది. కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూపతిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మండల అధ్యక్షుడు ప్రవీణ్ జె.టోని, జిల్లా నాయకుడు చిలుక రమేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై రాములోరి ఊరేగింపు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దత్తత శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం కొనసాగాయి. స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. మహిళలు మంగళహారతులతో వచ్చి మొక్కులు చెల్లించారు. ఆదివారం రాత్రి హనుమంతుని వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఉదయం 9గంటలకు నిత్యహవనం, తీర్థగోష్ఠి, సాయంత్రం వేదసదస్సు, నిత్యహవనం, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మోతె లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు నిమ్మ లక్ష్మి, నిమ్మ మల్లారెడ్డి, నిమ్మ నారాయణరెడ్డి, లద్దునూరి హన్మండ్లు, నిమ్మ సుధాకర్‌రెడ్డి, అర్చకులు వేణుగోపాలచారి, నవీన్‌చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు పెంచాలి

సిరిసిల్లటౌన్: ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్ల కార్మిక భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి, జిల్లా నాయకుడు అజ్జ వేణుతో కలిసి సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. జిల్లాలో 210 మంది ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారని, ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున జీతం అందిస్తున్నారని తెలిపారు. ఈ జీతంతో కుటుంబాన్ని పోషించుకోవడం చాలా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. వీరికి మూడు నెలలుగా జీతాలు రాక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో సోమవారం హన్‌మాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హన్‌మాన్ మాలధారులు మొక్కులు చెల్లించుకున్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పూజలు చేశారు. మాజీ సర్పంచ్ బాల్‌రాజ్ నర్సాగౌడ్, మాజీ ఎంపీటీసీలు దేవరాజు, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం సైకిల్‌యాత్ర



ఎల్లారెడ్డిపేట: నిరుపేదలకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త అలువాల రాములు సోమవారం సైకిల్‌యాత్ర చేపట్టారు. సిరిసిల్ల మండలం రగుడు అంబేడ్కర్ విగ్రహం నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర రాత్రికి ఎల్లారెడ్డిపేటకు చేరింది.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం శివారులోని అటవీప్రాంతంలో పేకాట స్థావరంపై సోమవారం ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఇద్దరు పట్టుబడగా, ఐదుగురు పరారయ్యారు. వీరి నుంచి ఒక మొబైల్‌ఫోన్, ఒక బైక్, రూ.4200 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గత మార్చి 31న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన ధరావత్ రమేశ్, అతని అన్న కొడుకు అజ్మీర రవీందర్ బైక్‌పై మార్చి 31న సాయంత్రం ఎల్లారెడ్డిపేటకు వచ్చారు. వ్యక్తిగత పనులు ముగించుకొని దుమాల రోడ్డు వైపు వెళ్తుండగా అదే సమయంలో కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి బుల్లెట్‌బండితో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధరావత్ రమేశ్, అజ్మీర రవీందర్‌లు గాయపడ్డారు. బాధితుడు రమేశ్ ఫిర్యాదుతో ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీడీ కార్మికుల కూలీ పెంచాలి

సిరిసిల్లటౌన్: బీడీ కార్మికుల కూలీరేట్లు పెంచాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షురాలు కేవీ అనసూర్య అన్నారు. సోమవారం సిరిసిల్లలోని కార్మికభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెరిగిన కరువుభత్యం ప్రకారం వెయ్యి బీడీలకు రూ.261.97 ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.4 వేల ఆసరా పెన్షన్ హామీని బీడీ కార్మికులకు అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు కదారి రాములు, ప్రధాన కార్యదర్శి అజ్జ.వేణు, ఉపాధ్యక్షులు రేగుల అనిత, సహాయ కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి శాంత, కార్యవర్గ సభ్యులు ప్రమీల, సరోజన, లక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



సందీప్‌రావు(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కస్బేకట్కూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు జూపెల్లి సందీప్‌రావు (34) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందాడు. మృతుడికి తల్లి సరోజన ఉంది. సందీప్‌రావు మృతిపట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మాట్ల మధు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

దివ్యాంగుడికి స్కూటీ అందజేత



దివ్యాంగుడికి స్కూటీ అందిస్తున్న శ్రీకుమార్

కోనరావుపేట: మండలంలోని సుద్దాలకు చెందిన దివ్యాంగుడు బాదవేణి శ్రీనివాస్‌కు మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ సోమవారం స్కూటీ అందజేశారు. వికలాంగుడు శ్రీనివాస్ పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్ రూ.లక్ష విలువైన స్కూటీని ఉచితంగా అందజేశారు. ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, ఉప్పుల శంకర్, ఎరవెల్లి నాగరాజు, కాశవేణి మహేశ్, కాకరకాయల మంజుల, మహేశ్, కాదాసు అంజయ్య, ఎరవెల్లి రాజయ్య, వంగల శ్రీనివాస్, మాసం సుమన్, గణేశ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడి రాజీనామా



బి.రాఘవరెడ్డి

ఇల్లంతకుంట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు భూంపెల్లి రాఘవరెడ్డి సోమవారం ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తన పదవీకాలంలో సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రాఘవరెడ్డి రాజీనామా చర్చనీయాంశమైంది. మండల నూతన అధ్యక్షుడిగా కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అవకాశం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.